రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



యోగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, జనవరి 24 : రోడ్డు ప్రమాదాలు నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా వర్గాలవారికి వర్క్‌షాప్ నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. హైవేలపై ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి అంబులెన్స్ అందుబాటులో ఉండాలని.. ప్రమాదానికి గురైన వారిని దవాఖానకు తరలించాలన్నారు.

యోగాతో అద్భుతాలు సృష్టించవచ్చు

సిద్దిపేట అర్బన్, జనవరి 24 : యోగా ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21 రోజు సూర్యనమస్కారం ఛాలెంజ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా విద్యలో సూర్యనమస్కారాలు చాలా ప్రముఖమైనవన్నారు. ప్రతిరోజు తప్పకుండా రన్నింగ్, వాకింగ్, యోగా, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 16 వరకు ఆసక్తి గల యోగా సాధకులు ప్రతిరోజు కనీసం 21 సూర్యనమస్కారాలు చేసి సంబంధించిన విషయాన్ని రికార్డు చేసి గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు.

మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్

కొండపాక, జనవరి 24 : రైతులను కించపర్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దుద్దెడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల మనోభావాలు దెబ్బతీసే విధంగా రైతుబంధు అడిగే వాళ్లను చెప్పులతో కొట్టాలని మంత్రి కోమటిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తీన్మార్ మల్లన్న మాట్లాడడం వారి అహంకారానికి నిదర్శమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను చెప్పులతో కొట్టాలని దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం–రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. సకాలంలో రైతులకు రైతుబంధు, రైతుబీమా అందజేయాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్‌ను అందజేయడంతోపాటు ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిక్కుడు భానుముదిరాజ్, పల్లె బాబు, ఎండీ ముగ్ధుమ్, నేతి గణేశ్, రాకేశ్‌గౌడ్, కేమ్మాసారం శ్యామ్, మెరుగు శివ, గుర్రాల రాజు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి గారూ.. నాకు రైతుబంధు పడలేదు

హుస్నాబాద్, జనవరి 24 : 'మంత్రి కోమటిరెడ్డి గారూ.. నాకు ఇప్పటివరకు రైతుబంధు పడలేదు.. మరి నిన్నేమనాలో నాకు అర్థంకావడం లేదు' అని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పెండెల ఐలయ్య ప్రశ్నించారు. రైతుబంధు పడలేదన్నోళ్లను చెప్పుతో కొట్టండి.. అంటూ రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరమని బుధవారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు 1.31 ఎకరాల భూమి ఉన్నదని, ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు పడలేదన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ రైతుబంధు పడితే నాకు ఎందుకు పడలేదో మంత్రి చెప్పాలన్నారు. యాసంగి వరినాట్లు వేసి కలుపులకు వస్తున్నప్పటికీ ఇంకా రైతుబంధు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల మనోభావాలను దెబ్బతీసేలా మంత్రి మాట్లాడడం సరికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా రైతులందరికీ రైతుబంధు డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు నిధులు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, జనవరి 24 : మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి రూ.కోటి కేటాయిస్తూ మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. బుధవారం పట్టణంలో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధితోపాటు వీధిదీపాల కోసం రూ.10 లక్షలు, పబ్లిక్ టాయిలెట్స్, సైన్ బోర్డుల ఏర్పాటుకు రూ.23 లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ మిగులు పనులకు రూ.4.50 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. డెట్ సోర్సింగ్ కార్మికులకు దుస్తులు, నూనె, సబ్బులు, పాదరక్షల కోసం రూ.4.90 లక్షలు, మంచినీటి క్లోరినేషన్‌కు రూ.99 వేలు, పైపులైన్లు, ట్యాంకుల రిపేర్‌కు రూ.10 లక్షలు తదితర పనులకు నిధులు కేటాయిస్తూ తీర్మానాలు చేశామన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్, కౌన్సిలర్లు నళినీదేవి, రమాదేవి, భాగ్యా రెడ్డి, రవీందర్, రత్నమాల, సుప్రజ, రాజు, శ్రీనివాస్, వేణుమాధవ్, లావణ్య, పద్మ, స్వర్ణలత, కో–ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, లలిత, లత, అధికారులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్, జనవరి 24: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ సూచించారు. బుధవారం హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనితా రెడ్డి, కమిషనర్ రాజశేఖర్, ఎల్‌డీఎం సత్యజిత్, యూనియన్ బ్యాంకు మేనేజర్ అరుణ్ కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, స్వర్ణలత, రత్నమాల, వైద్య బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 24 : గ్రామ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు రూపొందించాలని హుస్నాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి(డీఎల్పీవో) వీరభద్రయ్య సూచించారు. బుధవారం మద్దూరు మండలం రేబర్తిలో అభివృద్ధి ప్రణాళికల కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభకు డీఎల్పీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను గుర్తించాలని, దానికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అంతకుముందు గ్రామంలోని హరిత నర్సరీ, డంపింగ్‌షెడ్‌ను డీఎల్పీవో సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలు బాల్యవివాహాలు చేసుకోవద్దని, దేశ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. బాలికలు.. బాలురతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జడ్జిలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, జనవరి 24

సిద్దిపేట టౌన్: ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

ప్రొటోకాల్ పాటించడంలో కాంగ్రెస్ విఫలం

మిరుదొడ్డి: సమావేశంలో మాట్లాడుతున్న నమిలె భాస్కరాచారి, తదితరులు

మిరుదొడ్డి, జనవరి 24 : అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆత్మకమిటీ మాజీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీపీ సాయిలు అన్నారు. బుధవారం మండలంలోని అల్వాల గ్రామంలో మంత్రి కొండా సురేఖ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి బహిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు బీఆర్ఎస్ పూర్తిగా ప్రభుత్వానికి సహకరిస్తుందన్నారు. అల్వాల్‌లో మంత్రి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులంతా బహిష్కరిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ కిష్టయ్య ఒంటెద్దు పోకడలతోనే ప్రొటోకాల్ సమస్య వచ్చిందని మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ దిలీప్, సూకురి లింగ, మధు, రాజయ్య పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే సహించం

తొగుట, జనవరి 24 : ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడితే సహించేదిలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి హెచ్చరించారు. తొగుట, అల్వాల్‌లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పేరు తర్వాత సభాధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరును శిలాఫలకంపై ఏర్పాటు చేయాల్సి ఉండగా, హాజరుకాని మంత్రుల పేర్లు రాయడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యేను అవమానించే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, మంత్రి కొండా సురేఖ పర్యటనకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరుకావాల్సి ఉండగా, ప్రొటోకాల్ ఉల్లంఘన మూలంగా కార్యక్రమాన్ని బహిష్కరించామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దేవీరవీందర్

కుకునూర్‌పల్లి, జనవరి 24 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రాజిరెడ్డి, రాజు, సంతోష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎనిమిదేండ్లుగా పాఠశాలలో విద్యార్థులకు మంచి బోధన అందించిన ఉపాధ్యాయులు ఇక్కడి నుంచి వెళ్లడం బాధగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జనకీరామ్‌రెడ్డి, ఎస్ఏంసీ చైర్మన్ నర్సింహులు, నాయకుడు కందూరి ఐలయ్య, టీచర్లు పాల్గొన్నారు.

చర్చి స్థలాన్ని కాజేసే కుట్ర

చేర్యాల, జనవరి 24: చేర్యాల ఇండియా మిషన్ చర్చి ఆవరణలోని స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని చర్చి స్థల సంరక్షణ నాయకులు పిల్లి జాషువా, పిల్లి జీవరత్నం, కర్రోళ్ల జాన్సన్, కర్రోళ్ల శ్రీనివాస్, తాళ్ల డేవిడ్, దేవదాస్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1930లో చేర్యాలలో ప్రారంభించిన మిషన్ చర్చి కుష్టురోగులకు వైద్య సేవలు అందించిందన్నారు. ఆధ్యాత్మిక బోధకులు నివాసం ఉన్న మిషన్ బంగ్లా చరిత్ర ఈ ప్రాంత ప్రజలకు తెలుసన్నారు. మిషన్ నాయకులమని చెప్పుకుంటూ కొందరు చర్చి స్థలాన్ని కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. చర్చి స్థలం అమ్మడానికి లేదా కొనడానికి ఎవరికీ అధికారం లేదని, ఈ స్థలం ఇండి యా మిషన్ క్రైస్తవ విశ్వాసులు, సంఘం కాపరుల క్షేమాభివృద్ధికి మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. చర్చి స్థలాన్ని కాపాడేందుకు ఎఫ్ఈసీ, ఐఎంఐ కమిటీ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్తంభాన్ని తొలిగించాలి

మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్, జనవరి 24 : పట్టణంలోని 20వ వార్డులో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు వెంటనే తొలిగించాలని బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభం ఎప్పుడు విరిగిపోతుందోననే భయంతో వార్డు ప్రజలు ఉన్నారని తెలిపారు. పెనుప్రమాదం జరుగక ముందే స్తంభాన్ని తొలిగించి.. దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట రిటైర్డ్ ఉపాధ్యాయుడు వరయోగుల సుదర్శనస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్తీక్, రజనీకాంత్, అజ్జు తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 24 : వల్లంపట్ల గ్రామం నుంచి కూటిగల్ వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారిందని, రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోతకు గురైన బీటీ రోడ్డును సీపీఎం నాయకులు పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాన్నాల కుమార్‌మాదిగ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్ అర్బన్, జనవరి 24 : మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా ఉద్యోగాలు చేస్తున్న దళితులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాన్నాల కుమార్‌మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం వెంకటేశం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా దళిత కుటుంబాలు పారిశుధ్య పనులను నిర్వహిస్తూ గ్రామాలు, పట్టణాలను శుభ్రం చేస్తున్నాయన్నారు. కరోనా సమయంలోనూ పారిశుధ్య కార్మికులు ఉత్తమ సేవలందించారని, వారి సేవలను గుర్తించి ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 29న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జయభేరి నిర్వహిస్తామన్నారు. ఈ సభకు కార్మికులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం జయభేరి మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కార్మికులు సైదవ్వ, లక్ష్మి, ఐలవ్వ, కుమార్, కిష్టయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గజ్వేల్, జనవరి 24 : గజ్వేల్ డివిజన్ పరిధిలోని పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పారిశుద్ధ కార్మికులు బుధవారం గజ్వేల్ డీఎల్పీవో వేదవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న గ్రామాల్లో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా, అనేక గ్రామాల్లో మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులను వేతనాల గురించి అడిగితే తమ చేతుల్లో ఏమీలేదని సమధానం చెబుతున్నారని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో ప్రభుత్వం ఇచ్చే వేతనాలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కార్మికులు యాదగిరి, నాగరాజు, భరత్, చెన్నయ్య, బా బూరావు, భిక్షపతి, బాబు, రాములు, లక్ష్మణ్ ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై జగదీశ్వర్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 24: సైబర్ నేరాలతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై జగదీశ్వర్ సూచించారు. బుధవారం మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, పిన్ నంబర్లను చెప్పొద్దన్నారు. వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు పాల్పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు క్రాంతికుమార్, నరేశ్ పాల్గొన్నారు.

'కస్తూర్బా'కు కొత్త డెస్క్‌లు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 24: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్‌లో భాగంగా 288 డ్యూయల్ డెస్క్‌లను మంజూరు చేసింది. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు కూర్చోవడంతోపాటు రాసుకునేందుకు ఈ డెస్క్‌లు ఉపయోగపడుతాయన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేట టౌన్, జనవరి 24 : మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా కార్యాలయం, పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటారు సైకిల్ వాహదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రవాణాశాఖ జిల్లా అధికారి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రూల్స్ తప్పక పాటించాలి

చేర్యాల, జనవరి 24 : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేర్యాల ఎంవీఐ కవిత సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పరిమితికి మించి వేగంగా వెళ్లొద్దని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పి.అశోక్‌కుమార్, రామేశ్వర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

గజ్వేల్ అర్బన్, జనవరి 24: డ్రైవర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ఉత్తమ సేవలందించాలని గజ్వేల్ –ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా గజ్వేల్ ఆర్టీసీ డిపో, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్లు, 108, 102, ఎఫ్‌హెచ్ఎస్ వాహనాల పైలట్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డ్రైవర్లు చక్రపాణిగౌడ్, కొండల్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, రాజు, కరుణాకర్, భానుప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



భూంపల్లి దవాఖాన పనులను పరిశీలిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), జనవరి 24 : వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీఎంహెచ్‌వో కాశీనాథం సూచించారు. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండం భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న దవాఖాన గదుల పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు వైద్యం అందించడంలో డాక్టర్లు నిరక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు

నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థినులు

గజ్వేల్, జనవరి 24 : జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు గజ్వేల్ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. గురువారం నుంచి 28 వరకు మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో జరిగే 36వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు పాల్గొనేందుకు కస్తూర్బా పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.ధరణి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.అనూష బుధవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఎస్వో అనురాధ, పీఈటీ జ్యోతి తదితరులు అభినందించారు.

గీత కార్మికుడి మృతి

మాటూరి రవి(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, జనవరి 24 : ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని కూచనపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గీతకార్మికుడు మాటూరి రవి(48) వృత్తిలో భాగంగా బుధవారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య కళవ్వ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మల్లయ్య(ఫైల్)

చేర్యాల, జనవరి 24 : మండలంలోని పోతిరెడ్డిపల్లికు చెందిన రైతు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మ్యాడబోయిన మల్లయ్య(45) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో మల్లయ్యకు ఉన్న రెండు ఎకరాల పొలంలో 2 ఆవులు, 4 గెదేలతోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం మల్లయ్య తన పెద్దకుమారుడు రాజుతో కలిసి పాలు తీసుకొచ్చేందుకు తన బావి వద్దకు వెళ్